E-KABURU e paper
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
09-3-2025 ఆదివారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com



కనీస వేతనాల సవరణపై గెజిట్ ప్రచురించండి

3లో



## మహిళలు రాణించాలంటే చదువుకోవాలి

3లో



## భారత్.. అధిక సుంకాల దేశం

4లో




## 2025 ఆర్థిక సంవత్సరంలో గోధుమల దిగుమతి-ఎంతంటే..



## ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్..


6లో



## ఛాంపియన్స్ ట్రోఫీ విజేతకు ప్రైజ్‌మనీ ఎంతో తెలుసా..?

# తెలంగాణ మహిళల సాధికారతకు నూతన దిశ

## మహిళా సాధికారతపై సీఎం రేవంత్ రెడ్డి హామీ



- తెలంగాణ మహిళా సాధికారతకు బలమైన అడుగులు
- రాబోయే ఎన్నికల్లో 33% మహిళలకు రిజర్వేషన్.
- ప్రతి జిల్లాలో "ఇందిరా మహిళా శక్తి భవనాల" కోసం రూ. 25 లక్షల మంజూరు.
- 2,82,552 సంఘాలకు రూ. 22,794 కోట్ల చెక్కుల పంపిణీ.
- 1000 ఎలక్ట్రిక్ బస్సులకు మహిళలు యజమానులు అవుతున్నారు.
- మహిళల ఆశీర్వాదంతో రాష్ట్రంలో చంద్రగ్రహణం తొలగిపోయిందని వ్యాఖ్యానించారు.
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం.
- మహిళల సంక్షేమం & అభివృద్ధి కోసం సీతక్క, కొండా సురేఖ లాంటి నాయకుల పాత్రపై ప్రశంసలు.

2లో



# ఉమెన్స్ డే స్పెషల్ ..

## మోదీ ఖాతా నుంచి మహిళల పోస్టులు

**దేశంలోని మహిళలందరికీ ప్రధాని మోదీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు.**

**ఈకబురు ఢిల్లీ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారీశక్తికి వందనం అంటూ దేశంలోని మహిళలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ఎన్డీయే ప్రభుత్వం మహిళా సాధికారికతకు కృషి చేస్తోందని ఈసందర్భంగా వెల్లడించారు. ఈరోజు తన సోషల్ మీడియా ఖాతాలను మహిళలే నిర్వహిస్తున్నారని తెలిపారు. దానికి తగట్టుగానే మోదీ ఎక్స్ ఖాతా నుంచి చెస్ క్రీడాకారిణి ఆర్.వైశాలి వరుస పోస్టులు పెట్టారు.

''నేను వైశాలి. మహిళా దినోత్సవం రోజున ప్రధాని మోదీ సోషల్ మీడియా ఖాతా నుంచి నేను పోస్టు చేయడం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. నేనొక చెస్ ప్లేయర్. ఎన్నో టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపిస్తుంటుంది. ఆరో ఏట నుంచి నేను చెస్ ఆడుతున్నాను. అది నాకొక ఉత్తేజకరమైన ప్రయాణం. మీరు ఎంచుకున్న మార్గంలో ఎన్ని అవరోధాలు ఎదురైనా మీ కలలు సాకారం చేసుకోవడానికి ముందుకుసాగండి. ఆడపిల్లలకు అండగా నిలవాలని తల్లిదండ్రులు, తోబుట్టువులను ఈసందర్భంగా కోరుతున్నాను. వారి సామర్థ్యంపై నమ్మకం ఉంచండి.

తరువాయి 2లో

# గుజరాత్ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు

**గుజరాత్ కాంగ్రెస్‌లోని కొందరు నేతలు బీజేపీ కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. వసరమైతే 30-40 మంది నాయకులపై వేటు వేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టంచేశారు. అవసరమైతే 40 మందిపై వేటు: రాహుల్**



**అహ్మదాబాద్, మార్చి 8:** గుజరాత్ కాంగ్రెస్‌లోని కొందరు నేతలు బీజేపీ కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు.

2లో



## మహిళలకు నిర్ణయాధికారం అవసరం: ఎమ్మెల్సీ కవిత

2లో

# మీరు హామీలిచ్చి మమ్మల్ని నెరవేర్చమంటారా?

- **రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలు, 420 ఉప గ్యారంటీలు ఇచ్చిందని.., వాటిని కేంద్రం పూర్తి చేయాలన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆక్షేపించారు.**

**ఈకబురు హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలు, 420 ఉప గ్యారంటీలు ఇచ్చిందని.., వాటిని కేంద్రం పూర్తి చేయాలన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రాంతీయ వలయ రహదారి (ఆర్‌ఆర్‌ఆర్)కి అన్ని అనుమతులు వచ్చాక ఉత్తర భాగం భూమిపూజకు ప్రధాని మోదీ వస్తారని తెలిపారు. తెలంగాణ ప్రజలకు మోదీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. కానీ సోనియా, రాహుల్, రేవంత్‌రెడ్డిల వాగ్దానాలతో భాజపాకు ఏం సంబంధమని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో ఇటీవల 10 జాతీయ రహదారులను పూర్తిచేశామని, సుమారు రూ.6,280 కోట్ల



ఖర్చుతో, 285 కిలోమీటర్ల మేర నూతన జాతీయ రహదారులను నిర్మించామని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల తర్వాత వీటి ప్రారంభోత్సవానికి నితిన్ గడ్కరీ విచ్చేస్తారన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి రూ.18,772 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని, ఈ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం లభించాక ప్రధాని చేతుల మీదుగా భూమిపూజ జరుగుతుందని తెలిపారు. ఎన్‌హెచ్ 44లో భాగంగా 10 కిలోమీటర్ల మేర ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు 6 వరుసలతో ఎలివేటెడ్ కారిడార్‌గా కేంద్రం నిర్మించిందని, హైదరాబాద్ అంబర్‌పేట చౌరస్తాలో ఫ్లైఓవర్ పూర్తిచేసినట్లు వివరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, మెదక్, నల్గొండ తదితర జిల్లాల్లో కేంద్రం చేపట్టిన జాతీయ రహదారుల్లో పలుచోట్ల రాష్ట్రప్రభుత్వం భూసేకరణ చేయాలని, అటవీ క్లియరెన్స్ తీసుకోవాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో వేగం పెరగాలంటే రాష్ట్రసర్కారు భూసేకరణ పూర్తి చేయాలన్నారు. కోచ్ ఫ్యాక్టరీ తానే తెచ్చానని సీఎం రేవంత్ అంటున్నారని.., ఆయన అధికారంలోకి రాకముందే వరంగల్‌లో మోదీ కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారని కేంద్రమంత్రి గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై.. రాష్ట్రంలో జనాభా తగ్గినా.. సీట్లు తగ్గవని స్వయంగా ప్రధాని పార్లమెంటులో

తరువాయి 2లో

# అఖిలపక్ష ఎంపీల సమావేశంలో కీలక అంశాలపై చర్చ

**28 అంశాలపై చర్చించాం**
**రాష్ట్ర ప్రయోజనాల కోసం అంతా ఏకం కావాలి**
**డిప్యూటీ సీఎం మల్లు**

**ఈకబురు హైదరాబాద్:** రాష్ట్ర ప్రయోజనాల కోసం అంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్ లో అఖిలపక్ష ఎంపీల సమావేశంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 28 అంశాలపై చర్చ జరిగినట్లు భట్టి తెలిపారు. 'కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హామీలపై చర్చించాం. రాష్ట్రానికి

తరువాయి 2లో



## సీఎం రేవంత్ రెడ్డికి మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ

**ఈకబురు హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తిగా జరిగే వరకు అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున అందులో చట్టం చేస్తామని హామీ

2లో



## కరీంనగర్ నుంచి తిరుపతికి రోజూ రైలు నడపండి: అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి పొన్నం లేఖ

**ఈకబురు హైదరాబాద్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కరీంనగర్ నుంచి రోజూ తిరుపతికి రైలు

2లో





# మహిళలకు నిర్ణయాధికారం అవసరం: ఎమ్మెల్సీ కవిత

**ప్రపంచవ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం వచ్చినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.**

ప్రపంచవ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం వచ్చినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం అమలు చేయకపోవడంతో మహారాష్ట్ర, ఢిల్లీ, హరియాణా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారన్నారు. జనగణనకు బడ్జెట్ లో ఎందుకు నిధులు ఇవ్వలేదని ప్రశ్నించారు. జనగణన సర్వే చేస్తే రానున్న బిహార్, తమిళనాడు ఎన్నికల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలవుతారన్నారు. ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడతామని, మహిళా సంఘాల ద్వారా అద్దెకు తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందా? అనేది స్పష్టత ఇవ్వాలన్నారు. మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ మహిళల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేశారన్నారు. కేరళ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో మహిళ, పురుష సమానత్వ బొమ్మలు ప్రచురిస్తున్నారని, అలాంటివి తెలంగాణలోనూ రావాల్సి ఉందన్నారు. ఎన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ మహిళలకు అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఉమెన్స్ డే స్పెషల్ ..
## మోదీ ఖాతా నుంచి మహిళల పోస్టులు

మొదటి పేజి తరువాయి

వారు అద్భుతాలు చేయగలరు. నా అదృష్టంకొద్దీ నా తల్లిదండ్రులు, సోదరుడు (భారత గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద) అండగా ఉన్నారు. నా సోదరుడితో ప్రత్యేక అనుబంధం ఉంది'' అని రాసుకొచ్చారు. తర్వాత న్యూక్లియర్, స్పేస్ సైంటిస్ట్‌లు అయిన ఎలినా మిశ్రా, శిల్పి సోనీ.. మోదీ ఖాతా నుంచి పోస్టులు పెట్టారు. భారతదేశం సైన్స్ పరిశోధనలకు అత్యంత అనుకూలమైన ప్రదేశమన్నారు. మరింత ఎక్కువ మంది మహిళలు ఈ రంగాన్ని ఎంచుకోవాలని కోరారు.

**నేను అనితా దేవిని..**

నలందా జిల్లాకు చెందిన అనితాదేవి ప్రధాని ఖాతా నుంచి తన విజయాలు వెల్లడించారు. ''నేను జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. నా కాళ్ల మీద నిలబడి, సొంతంగా ఏదైనా సాధించాలనే తపన ఉండేది. 2016లో ఆ దిశగా అడుగేశాను. అప్పుడే స్టార్టప్‌లపై క్రేజ్ పెరుగుతోంది. నేను కూడా మాదోపుర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను ప్రారంభించాను. నాతో కలిసి పనిచేసిన మహిళలు స్వయంసమృద్ధి సాధించడం నాకు అత్యంత సంతోషాన్ని ఇచ్చింది. వారి కుటుంబాలు బాగుపడటం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు గౌరవాన్ని ఇస్తుందని నా నమ్మకం. మీరు అంకిత భావం, కృషితో ముందుకుసాగాలని బలంగా అనుకుంటే ఏ శక్తి మిమ్మల్ని ఆపలేదు'' అంటూ తన స్టోరీ వెల్లడించారు. తర్వాత ఫ్రాంటియర్ మార్కెట్ సీఈఓ అజైతా షా, డాక్టర్ అంజలీ అగర్వాల్ కూడా తమ ప్రయాణం గురించి వెల్లడించారు.

# గుజరాత్ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు

మొదటి పేజి తరువాయి

అవసరమైతే 3040 మంది నాయకులపై వేటు వేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టంచేశారు. కనీసం 5u ఓట్లు పెంచుకోగలిగితే రాష్ట్రంలో అధికారం మనదేనని చెప్పారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో చివరిరోజైన శనివారం అహ్మదాబాద్‌లో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. 'మనలో కొందరు నేతలు రహస్యంగా బీజేపీ కోసం పనిచేస్తున్నారు. వారెవరో మనం వడపోయాలి. లేకుంటే రాష్ట్ర ప్రజలు మనల్ని విశ్వసించరు' అని చెప్పారు. ప్రజలు బీజేపీ వలలో చిక్కుకున్నారని అన్నారు. గత 2025 ఏళ్ల బీజేపీ విజన్ విఫలమైందని.. కాంగ్రెస్ తేలికగా కొత్త విజన్ అందించగలదని తెలిపారు. 'గుజరాత్‌లో కాంగ్రెస్‌కు జిల్లా, బ్లాక్, ఇతర స్థాయుల్లో నేతలకు కొదువలేదు.

కానీ వారు సంకెళ్లలో ఉన్నారు. నాతో సహా అందరం రాష్ట్ర ప్రజల్లోకి వెళ్లాలి. వారు చెప్పేది వినాలి. నా నుంచి ఏమాశిస్తున్నారు.. వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్ కోసం మనం ఏం చేస్తామో వారికి తెలియాలి' అని చెప్పారు. ఐదు శాతం ఓట్లు పెంచుకోగలిగినా రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో పార్టీ 22 శాతం ఓట్లు పెంచుకుందని.. అధికారంలోకి వచ్చిందని ప్రస్తావించారు. 2027లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే నెల 89 తేదీల్లో గుజరాత్(అహ్మదాబాద్)లోనే ఏఐసీసీ ప్లీనరీ జరుగనుంది.

## ...అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి పొన్నం లేఖ

మొదటి పేజి తరువాయి

నడిపేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన లేఖ రాశారు.

''ప్రస్తుతం కరీంనగర్ నుంచి వారానికి రెండు సార్లు (గురువారం, ఆదివారం) మాత్రమే తిరుపతికి రైలు వెళ్తోంది. అదే రైలు తిరుపతి నుంచి కరీంనగర్‌కు బుధ, శనివారాల్లో తిరిగి బయలుదేరుతుంది. యూపీఏ హయాంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ఈ రైలును ఉత్తర తెలంగాణ ప్రజలు తిరుపతి వెళ్లడానికి వీలుగా, సులభతరంగా ఉండేలా అందుబాటులోకి తీసుకొచ్చాం. ఉత్తర తెలంగాణ ప్రాంతాల నుంచి ప్రస్తుతం తిరుమలకు వెళ్లే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ రైలు ప్రతిరోజూ నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం ప్రభుత్వాన్ని గత పదేళ్లుగా కోరుతున్నాను. ప్రయాణికుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిత్యం కరీంనగర్ నుంచి తిరుపతికి రైలు నడిచేలా చర్యలు తీసుకోండి'' అని లేఖలో పేర్కొన్నారు.

## ..మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ

మొదటి పేజి తరువాయి

ఇచ్చారు. మళ్లీ గ్రూప్ 1 గ్రూప్ 2 గ్రూప్ 3 పరీక్ష ఫలితాలు విడుదల విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటన చేసింది. ఎస్సీలకు మరోసారి అన్యాయం జరుగుతుంది'' అని లేఖలో మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

''ఇంతకుముందు 11 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయడం వలన మేము ఎన్ని పోస్టులు నష్టపోయామో మీకు తెలుసు. దయ చేసి ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు అన్ని పోటీ పరీక్షలను నిలిపివేయండి'' అంటూ లేఖలో మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.



# తెలంగాణ మహిళల సాధికారతకు నూతన దిశ

**ఈకబురు హైదరాబాద్:** ఆడబిడ్డల ఆశీర్వాదంతో తెలంగాణలో చంద్ర గ్రహణం తొలగిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సభలో సీఎం ప్రసంగించారు. ''ఏ మార్పు కావాలని ఆడబిడ్డలు ఆశీర్వదించారో ఆ మార్పు ఇప్పుడు పరేడ్ గ్రౌండ్‌లో కనిపిస్తోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే రాష్ట్రం 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ అవుతుందని కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయించాం. ఆడ బిడ్డలు తలచుకుంటే వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధన పెద్ద కష్టం కాదు.

65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. పాఠశాలల నిర్వహణ, బడి పిల్లలకు కోటి 30లక్షల జతల యూనిఫామ్ కుట్టించే పని మహిళలకే అప్పగించాం. జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు కేటాయించాం. సోలార్ విద్యుత్ ఉత్పత్తి మహిళా సంఘాలకు ఇచ్చాం. ఆర్టీసీలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులకు యజమానులు అవుతున్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం సీతక్క, కొండా సురేఖ పనిచేస్తున్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఉండాలని సోనియాగాంధీ కృషి చేశారు. ఇందిరను అమ్మా అన్నారు.. ఎన్టీఆర్‌ను అన్నా అన్నారు.. నన్ను రేవంతన్న అంటున్నారు. మీతో పేగుబంధం కలిగిన మీ అన్నగా మాట ఇస్తున్నా.. మిమ్మల్ని కోటీశ్వరుల్ని చేస్తా'' అని సీఎం అన్నారు.

**మహిళలు పూర్తిగా సాధికారత పొందే వరకు, తెలంగాణ అభివృద్ధి పథంలో భాగస్వాములయ్యే వరకు, ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.**

కోటి మంది ఆడబిడ్డలను ఆర్థికంగా స్వావలంబన కలిగిన వ్యాపారస్తులుగా తీర్చిదిద్దే వరకు విశ్రమించమని స్పష్టం చేశారు.

"ఇందిరా మహిళా శక్తి" బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రకటించిన కీలక నిర్ణయాలు



**రైస్ మిల్లుల ఏర్పాటు:**
మహిళా సంఘాలకు రైస్ మిల్లులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సహాయపడుతుంది.
ధాన్యం నిల్వ కోసం గోడౌన్లు నిర్మించేందుకు మద్దతు.
వడ్లను మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి సరఫరా చేసే అవకాశం.

**స్వయం సహాయక సంఘాల సభ్యత్వ విస్తరణ:**
ప్రస్తుత 65 లక్షల సభ్యుల నుంచి కోటి మందికి పెంపు.
కనిష్ట వయస్సు 18 నుంచి 15 ఏళ్లకు తగ్గింపు.
గరిష్ట వయస్సు 60 నుంచి 65 ఏళ్లకు పెంపు.

ఆర్టీసీ బస్సుల మహిళా యాజమాన్యం:
లీజుకు ఇచ్చేందుకు బదులుగా 1000 బస్సులు ఆడబిడ్డలకు మంజూరు.
మొదటివిడతగా 150 బస్సుల ప్రారంభం.
ప్రతి నెలకు లక్ష రూపాయల ఆదాయం పొందే అవకాశం.

**చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం:**
రాబోయే ఎన్నికల్లో 33% మహిళలకు రిజర్వేషన్.

**సోలార్ విద్యుత్ & మహిళా శక్తి భవనాలు:**

- 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ఒప్పందం.
- ప్రతి జిల్లాలో "ఇందిరా మహిళా శక్తి భవనాల" కోసం రూ. 25 లక్షల మంజూరు.
- "ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025" ఆవిష్కరణ
- 2,82,552 సంఘాలకు రూ. 22,794 కోట్ల చెక్కుల పంపిణీ.
- స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్‌ల శంకుస్థాపన. బీమా పథకాల నిధుల విడుదల.
- మహిళల ఆర్థిక స్వావలంబన & సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

మహిళల నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రోత్సాహం.
స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం:
ఆదిలాబాద్ గిరిజన కళలు, నిర్మల్ బొమ్మలు, తినుబండారాల వంటి ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం.
శిల్పారామం పక్కన 150 షాపుల ఏర్పాటు.
ఉత్పత్తులపై పన్నుల తగ్గింపు ప్రస్తావన.
విద్యా రంగంలో మహిళా సంఘాల పాత్ర
ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు అప్పగింపు.
1.30 కోట్ల స్కూల్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు.
కుట్టుకూలిని 75 రూపాయలకు పెంపు.

# అఖిలపక్ష ఎంపీల సమావేశంలో కీలక అంశాలపై చర్చ

మొదటి పేజి తరువాయి

రావాల్సిన అంశాలను కేంద్రం నెరవేర్చాలని కోరుతూ ప్రతిపాదనలు ఇప్పటికే ఇచ్చాం మళ్ళీ ఇస్తాం.

కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ అంశాలపై చర్చించాం. కేంద్రమంత్రులను కూడా ఆహ్వానించాం.. సమావేశానికి రావాలని బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలను ప్రత్యేకంగా ఆహ్వానించినా రాలేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉంది. విభజన చట్టం నుండి రావాల్సిన రాష్ట్ర హక్కుల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాం. రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం నుండి ఎంపీల అందరికీ వివరాలు పంపిస్తాం.

బీఆర్ఎస్ ఆనాడు చేయాల్సిన ప్రయత్నం సరిగా చేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక కొంచెం ఒత్తిడి పెంచాం. పార్లమెంట్ లో కేంద్రం మీద ఒత్తిడి చేయాలని మ ప్రయత్నం. కేంద్రం నుండి రావాల్సిన నిధులు..ప్రాజెక్టులు అందాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీల ఎంపీలు కలిసి రావాలి. ఇంకో సమావేశం ఏర్పాటు చేసి మళ్ళీ చెప్తం. ముందే సమాచారం ఇస్తాం. అప్పుడైనా బీజేపీ.. వాళ్ళు కలిసి



వస్తారు. కేంద్రం కి ఇచ్చిన లేఖలు..సమాచారం బుక్ లెట్ గా రూపొందించాం' అని భట్టి పేర్కొన్నారు.

**నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం**

తెలంగాణ ప్రభుతవం ఏర్పాటు చేసిన అఖిలపక్ష ఎంపీల సమావేశాన్ని స్వాగతిస్తున్నామన్నారు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ. కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదు. నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు' అని ఓవైసీ అన్నారు.



# మీరు హామీలిచ్చి మమ్మల్ని నెరవేర్చమంటారా?

మొదటి పేజి తరువాయి

చెప్పారన్నారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకు రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్ దక్షిణాదిలో సీట్లు తగ్గుతాయంటూ అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భారాస వల్ల రాష్ట్రంలో రూ.7.5 లక్షల కోట్ల అప్పు ఉందని మాట్లాడారని, ఇప్పుడు సీఎం అయ్యాక.. రూ.3.5 లక్షల కోట్లే అప్పులు ఉన్నాయనుకున్నానంటూ తెలంగాణ ప్రజలను మోసగిస్తున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఎంపీల సమావేశ సమాచారం ఆలస్యంగా అందింది: కిషన్‌రెడ్డి**

ప్రజాభవన్‌లో ఎంపీల సమావేశానికి సంబంధించి సమాచారం ఆలస్యంగా అందిందని.., అందుకే తమ పార్టీ సభ్యులు రాలేకపోయినట్లు కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శనివారం లేఖ రాశారు. ''ప్రాధాన్యం కలిగిన ఇలాంటి సమావేశాల్లో కీలక అంశాలపై అర్థవంతమైన చర్చ జరిగేందుకు కనీస సమయం అవసరమనే విషయం మీకు తెలిసిందే. భాజపా సభ్యులందరికీ శుక్రవారం రాత్రి ఆలస్యంగా సమాచారం అందింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి నియోజకవర్గాల్లో ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. భవిష్యత్తులో ఎప్పుడైనా ఇలాంటివి నిర్వహించాలని భావిస్తే ముందుగానే తెలియజేస్తారని ఆశిస్తున్నాం. ప్రధాని మోదీ నేతృత్వంలో భాజపా ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసింది'' అని లేఖలో పేర్కొన్నారు.

# మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పుల పాలవుతున్నారు

**రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో మహిళలు కోటీశ్వరులు కావడం లేదని, వారు అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.**



**హైదరాబాద్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో మహిళలు కోటీశ్వరులు కావడం లేదని, వారు అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళలకు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి.. బకాయిలనే చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని దుయ్యబట్టారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను ఎలా ఇస్తుందని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. "ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ మహిళలకు వేదనే మిగులుతోంది. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన మొట్టమొదటి హామీ ఏడాదిన్నరగా అమలుకు నోచుకోవడం లేదు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ.37,500 ఎప్పుడు చెల్లిస్తారు? ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్ష ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైంది? కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, బతుకమ్మ చీరలు, ఆరోగ్యలక్ష్మి, పింఛన్ల పెంపును ఇందిరమ్మ రాజ్యంలో పక్కన పెట్టారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు భద్రత కరవైంది. స్త్రీ సంక్షేమంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీలన్నింటినీ మహిళా శక్తి వేడుకల సందర్భంగా నెరవేర్చాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

**రుణాల పేరుతో తప్పించుకుంటున్నారు**

అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇంకెన్నాళ్లు అప్పుల పేరు చెప్పి తప్పించుకుంటారని రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు మరో ప్రకటనలో ప్రశ్నించారు. 'తెలంగాణ అప్పు రూ.7 లక్షల కోట్లు అంటూ మీరు చేస్తున్న ప్రచారం శుద్ధ తప్పు. రాష్ట్ర అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని అసెంబ్లీ వేదికగా ఆధారాలతో వివరించాను. సీఎం మాత్రం అవాస్తవాలను చెబుతూ భారాస పాలనపై దుష్ప్రచారం చేస్తున్నారు' అని విమర్శించారు.



# కనీస వేతనాల సవరణపై గెజిట్ ప్రచురించండి

**కనీస వేతనాలకు సంబంధించిన గెజిట్‌ను 4 వారాల్లో ప్రచురించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది.**

**హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్:** కనీస వేతనాలకు సంబంధించిన గెజిట్‌ను 4 వారాల్లో ప్రచురించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. గెజిట్‌ను ప్రచురించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను 4 వారాల్లో అమలు చేయాలని లేదంటే సంబంధిత అధికారి వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రతి అయిదేళ్లకు ఒకసారి కనీస వేతనాలను సవరించి గెజిట్ జారీ చేయాల్సి ఉండగా చేయలేదని, 2021 జూన్ 25, 30 తేదీల్లో కనీస వేతనాలను సవరించినా గెజిట్ విడుదల చేయకపోవడంపై 2023లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారించిన హైకోర్టు 6 వారాల్లో గెజిట్ ప్రచురించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ చర్యల వల్ల సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం జీవోలు జారీ చేసి ఆ తరువాత పట్టించుకోవడంలేదన్నారు. గెజిట్ జారీ చేయకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడంలేదన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామన్నారు. 4 వారాల్లో ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 11కు వాయిదా వేసింది..

# భారత్.. అధిక సుంకాల దేశం

**భారత్, చైనా సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని ఇటీవల కాంగ్రెస్ ఉభయసభల సమావేశంలో పేర్కొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అదే విషయాన్ని పునరుద్ఘాటించారు.**

**ఏప్రిల్ 2 నుంచి ఇది మారనుంది**



**మా ప్రతీకార సుంకాలు మొదలవుతాయి**

**డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక**

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్, చైనా సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని ఇటీవల కాంగ్రెస్ ఉభయసభల సమావేశంలో పేర్కొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అదే విషయాన్ని పునరుద్ఘాటించారు. ముఖ్యంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. భారత్ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించారు. వచ్చే నెల రెండో తేదీ నుంచి తమ ప్రతీకార సుంకాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. "భారత్, చైనాలపై మా ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2న భారీస్థాయిలో అమలవుతాయి" అని పేర్కొంటూ భారత్‌ను అధిక సుంకాల దేశంగా ట్రంప్ అభివర్ణించారు. కెనడా అత్యధికంగా సుంకాలు విధిస్తోందని ఒవల్ కార్యాలయంలో కొన్ని కార్యనిర్వాహక ఉత్తర్వులపై గురువారం సంతకం చేస్తూ ట్రంప్ తెలిపారు. ఏప్రిల్ 2న విధించే సుంకాలు.. అమెరికా దశను మార్చనున్నాయని అన్నారు. అమెరికా ప్రతీకార సుంకాలపై భారత్ ఆచితూచి స్పందించింది. సుంకాలు, సుంకాలేతర అడ్డంకులను అధిగమించడానికి బహుళ రంగ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కింద అమెరికాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని పేర్కొంది.

**మెక్సికో, కెనడాలకు ఊరట**

కెనడా, మెక్సికోల వస్తువులపై విధించిన 25% సుంకాల అమలు విషయంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గారు. ఆ దేశాల నుంచి దిగుమతి అయ్యే పలు వస్తువులపై సుంకాలను మరో నెల రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కెనడా, మెక్సికోలపై సుంకాల అమలు వాయిదా వేయడం ఇది రెండోసారి.

# మహిళలు రాణించాలంటే చదువుకోవాలి: సీఎం

**కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.**

**హైదరాబాద్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న రాజీవ్‌గాంధీ కలల్ని.. మహిళా వర్సిటీ విద్యార్థులు నిజం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.550 కోట్ల విలువైన నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు సీఎం.. శంకుస్థాపనలు చేశారు.

ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం వస్తుందని, అందులో మీ ప్రాతినిధ్యం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. మహిళలకు అవకాశం ఇస్తే తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ యూనివర్సిటీలో చదువుకోవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని, మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్నానన్న సీఎం రేవంత్ రెడ్డి.. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని వివరించారు. ఆడబిడ్డలు వంటింటి కుందేళ్లు కాదని.. వారు వ్యాపారవేత్తలుగా రాణిస్తారన్న భావనతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అదానీ, అంబానీలతో మహిళలు పోటీపడేలా కార్యాచరణ తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు విశ్వవిద్యాలయంలో దర్బార్ హాల్‌ను సీఎం సందర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.






# ప్రతి మహిళను తమ ఇంట్లో ఆడబిడ్డలా చూడాలి: మంత్రి సీతక్క

**సమానత్వం మహిళా దినోత్సవ ముఖ్య ఉద్దేశమని మంత్రి సీతక్క అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ పోలీసు ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా నుంచి రన్ ఫర్ యాక్షన్-2025 నిర్వహించారు.**

**హైదరాబాద్:** సమానత్వం మహిళా దినోత్సవ ముఖ్య ఉద్దేశమని మంత్రి సీతక్క అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా నుంచి రన్ ఫర్ యాక్షన్2025 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేదన్నారు. మహిళలు, పురుషులకి మధ్య సామర్థ్యాల్లో తేడాలేమీ లేవని.. అందరూ సమానమే అనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

"మహిళల భద్రత కోసం పోలీసులు కృషి చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాల కోసం ఇతర దేశాల నుంచి హైదరాబాద్ వస్తున్నవారు ప్రశాంతంగా ఉంటున్నారంటే కారణం పోలీసులు. పురుషుడు ప్రతి మహిళను తమ ఇంట్లో ఒక ఆడబిడ్డలా చూస్తే వారు క్షేమంగా ఇంటికి తిరిగి రాగలుగుతారు. ఇటీవలి కాలంలో మత్తు మన జీవితాలను చిత్తు చేస్తోంది.. మన గౌరవాన్ని తగ్గిస్తోంది. మాదకద్రవ్యాల నుంచి ఈ సమాజాన్ని చైతన్యవంతంగా మార్చాలి. మహిళల రక్షణకు, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మహిళలను ఎదగనిద్దాం.. గౌరవిద్దాం.. ఆత్మ గౌరవంతో తలెత్తుకొని తిరగనిద్దాం" అని సీతక్క తెలిపారు.

**సీతక్క వుమెన్ ఆఫ్ స్ట్రగుల్: సీవీ ఆనంద్**

మంత్రి సీతక్క వుమెన్ ఆఫ్ స్ట్రగుల్ అని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కొనియాడారు. ఆమె అందరికీ ఆదర్శమని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో 20 మంది డీసీపీల్లో 8 మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లలో ఇటీవల మహిళా ఎస్‌హెచ్‌వోలను నియమించినట్లు చెప్పారు. కమిషనరేట్‌లో 18 వేల మంది పోలీసు సిబ్బందిలో 30 శాతం మంది మహిళలే ఉన్నారన్నారు. ఇవన్నీ మహిళల ఉన్నతికి నిదర్శనమని సీపీ

# కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

**హైదరాబాద్:** తెలంగాణలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడంతోపాటు 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు మంజూరు చేయాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు విజ్ఞప్తి చేశారు. కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైల్వేకు ఆదాయం భారీగా పెరుగుతుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్య, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కేంద్ర మంత్రిని శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం కలిసి.. తెలంగాణకు అవసరమైన రైల్వే ప్రాజెక్టుల జాబితాను అందించారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల పరిధిలో రైల్వే లైన్ల వద్ద ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించడంతో పాటు పలు పనులు చేపట్టాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ విడివిడిగా వినతిపత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఉన్నారు.

**రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అంశాలు**

కాజీపేటను రైల్వే డివిజన్ చేస్తే రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను వేగవంతం చేయాలి.

**వికారాబాద్-కృష్ణా లైన్‌ను ప్రధానమంత్రి గతిశక్తి పథకంలో నిర్మించాలి.**

గద్వాలడోర్నకల్ రైల్వే లైన్ ఫైనల్ లొకేషన్ సర్వేపై ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఈ లైన్‌ను కూసుమంచి మీదుగా కాకుండా డోర్నకల్ నుంచి గద్వాల్ వరకు వెన్నారం, మన్నెగూడెం, అభిపాలెం, మరిపెడ, మోతె ద్వారా వెళ్లేలా చూడాలి.

కల్వకుర్తిమాచర్ల, డోర్నకల్‌మిర్యాలగూడ, ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ హైవేల పక్కన రైల్వే లైన్, భద్రాచలంపాం దురంగాపురం లైన్లను 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరు చేయాలి. వరంగల్ చుట్టూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డు నిర్మాణం గురించి వివరించగా.. రింగ్ రైల్ మంజూరు చేస్తామని అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు కోమటిరెడ్డి తెలిపారు. చింతనపల్లిలోని కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు రైలు మార్గం ఏర్పాటుకు రైల్వే అధికారులకు అశ్వినీ వైష్ణవ్ ఆదేశాలు జారీ చేశారని సురేఖ పేర్కొన్నారు.

**రైల్వేలైన్ల కోసం మంత్రి తుమ్మల వినతి**

సత్తుపల్లికొవ్వూరు, పెనుబల్లికొండపల్లి రైల్వే ప్రాజెక్టును మంజూరు చేయాలని, గోదావరి నదిపై నిర్మించాల్సిన రైల్వే బ్రిడ్జి పనులను వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు



తెలంగాణలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడంతోపాటు 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు మంజూరు చేయాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు విజ్ఞప్తి చేశారు. కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైల్వేకు ఆదాయం భారీగా పెరుగుతుందని తెలిపారు.100 శాతం కేంద్ర నిధులతో కొత్త లైన్లు మంజూరు చేయాలి
వరంగల్ రింగ్ రోడ్డు చుట్టూ రింగ్ రైల్ నిర్మించాలి
రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు
అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో కడియం కావ్య, సీతక్క, అరుణ్‌కుమార్‌జైన్, మల్‌రెడ్డి రాంరెడ్డి



# క్రిప్టో మార్కెట్ వైపు అతివల అడుగులు కారణం ఇదే..

క్రిప్టో కరెన్సీ విలువ రోజురోజుకి వృద్ధి చెందుతున్న తరుణంలో.. చాలామంది చూపు దీనిపై పడింది. అయితే క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడుతున్న వారిలో పురుషులే అధికంగా ఉన్నప్పటికీ.. స్త్రీల సంఖ్య కూడా కొంత పెరిగిందని, దేశంలోని ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజ్ 'జియోటస్' వెల్లడించింది.

మహిళా పెట్టుబడిదారులు భారత క్రిప్టో మార్కెట్ లోకి మునుపటి కంటే ఎక్కువగా ప్రవేశిస్తున్నారు. ఈ సంఖ్య 20 శాతం పెరిగిందని జియోటస్ స్పష్టం చేసింది. మహిళా పెట్టుబడిదారులు దీర్ఘకాలిక పెట్టుబడులలో మాత్రమే కాకుండా.. బిట్‌కాయిన్, ఎథెరియం వంటి వాటిలోకి ప్రవేశిస్తున్నారు.

మహిళలు క్రిప్టో కరెన్సీవైపు ఎక్కువ ఆసక్తి చూపించడానికి ప్రధాన కారణం.. చదువుకున్న వారికి డిజిటల్ అవగాహన, పెట్టుబడికి సంబంధించిన అవగాహన పెరగడం అని తెలుస్తోంది. యువత ఎక్కువగా క్రిప్టోలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు ఆర్థిక నిపుణులు కూడా చెబుతున్నారు.

ఇప్పుడు పెద్ద పెద్ద పట్టణాల్లో ఉన్న మహిళలు మాత్రమే కాకుండా. టైర్ 2, టైర్ 3 నగరాల్లోని మహిళలు కూడా వివిధ రంగాలలో పెట్టుబడులు పెడుతున్నారు. ఇందులో క్రిప్టో కరెన్సీ కూడా ఉంది. రాబోయే రోజుల్లో మహిళా పెట్టుబడిదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉందని జియోటస్ అంచనా వేస్తోంది.




# మహిళలకు ఫ్రెష్‌బస్ ఫ్రీ కార్డులు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న తమ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు రూ. 500 వరకు పొదుపు చేసే ఫ్రెష్ కార్డులను ఉచితంగా ఇస్తున్నట్లు ఫ్రెష్‌బస్ తెలిపింది. వీటిని తదుపరి 10 రైడ్స్ కోసం ఉపయోగించుకోవచ్చని, ఒక్కో రైడ్‌పై రూ. 50 ఆదా చేసుకోవచ్చని వివరించింది.

తమ వెబ్‌సైట్ లేదా యాప్‌లో బుక్ చేసుకున్న వారికి ఇది వర్తిస్తుందని పేర్కొంది. హైదరాబాద్, తిరుపతి, గుంటూరు, విజయవాడ, బెంగళూరు తదితర రూట్లలో సర్వీసులు నడిపిస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు సుధాకర్ రెడ్డి చిర్రా తెలిపారు. సంస్థను ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ తమ బస్సుల్లో 6.5 లక్షల మంది ప్రయాణించగా ఇందులో 30 శాతం అంటే 1.94 లక్షల మంది మహిళలు ప్రయాణించారని ఆయన తెలిపారు. మహిళలకు తమ సంస్థపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.




# ఆధార్ ధ్రువీకరణ లావాదేవీలు 225 కోట్లు

**మరో 43 కోట్ల ఈ–కేవైసీ లావాదేవీలు ఫిబ్రవరి నెలలో నమోదు**

**న్యూఢిల్లీ:** డిజిటల్ లావాదేవీలకు ఆధార్ కీలకంగా మారుతోంది. ఫిబ్రవరి నెలలో ఆధార్ ఆధారిత ధ్రువీకరణ లావాదేవీలు 225 కోట్లుగా ఉన్నాయి. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ లావాదేవీలు మరో 43 కోట్లు జరిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇతర రంగాల్లో ఆధార్ ఆధారిత ధ్రువీకరణకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆధార్ ధ్రువీకరణలు మెరుగైన కస్టమర్ అనుభవానికి తోడ్పడుతున్నట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది.

ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ లావాదేవీలు గతేడాది ఫిబ్రవరి గణాంకాలతో చూస్తే 14 శాతం పెరిగాయి. ఇక 2025 ఫిబ్రవరి నాటికి మొత్తం మీద ఆధార్ ధ్రువీకరణ లావాదేవీలు 14,555 కోట్లను అధిగమించాయి. అలాగే ఇప్పటి వరకు నమోదైన ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ లావాదేవీలు 2,311 కోట్లకు చేరాయి. ఆధార్ ముఖ గుర్తింపు ధ్రువీకరణలకూ ఆదరణ పెరుగుతోంది. ఫిబ్రవరిలో ఇలాంటివి 12.54 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి.

2021 ఫిబ్రవరిలో ఆధార్ ముఖ గుర్తింపు ధ్రువీకరణను ప్రవేశపెట్టగా.. అప్పటి నుంచి చూస్తే నెలవారీ గరిష్ఠ లావాదేవీలు ఫిబ్రవరిలోనే నమోదు కావడం గమనార్హం. ఇప్పటి వరకు మొత్తం ముఖ గుర్తింపు ధ్రువీకరణ లావాదేవీలు 115 కోట్లకు చేరాయి. ఇందులో 87 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే నమోదు కావడం గమనార్హం. కోటక్ మహీంద్రా ప్రైమ్, ఫోన్‌పే, కరూర్ వైశ్యా బ్యాంక్, జేఅండ్‌కే బ్యాంక్ ముఖ గుర్తింపు ధ్రువీకరణ కోసం కొత్తగా అనుమతి పొందాయి. ఇప్పటి వరకు మొత్తం 97 సంస్థలకు ఇందుకు అనుమతి లభించింది.

# 2025 ఆర్థిక సంవత్సరంలో గోధుమల దిగుమతి ఎంతంటే..

**ఆహార ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించేందుకు భారత ప్రభుత్వం 2025 ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్1, 2024 నుంచి మార్చి 31, 2025)లో మూడు మిలియన్ టన్నుల (ఎంటీ) గోధుమలను బహిరంగ మార్కెట్ నుంచి దిగుమతి చేసుకుంది. ఆహార ధాన్యాల నిల్వల నిర్వహణ, మార్కెట్లో ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఈ చర్యలను అమలు చేసినట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇటీవల కాలం వరకు మిగులు గోధుమ నిల్వలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఓఎంఎస్ఎస్) కింద 2024 ఆర్థిక సంవత్సరంలో బల్క్ కొనుగోలుదారులకు రికార్డు స్థాయిలో 10 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించడం విశేషం.**



**లభ్యత తగ్గుదల**

202324 పంట సంవత్సరానికి భారతదేశ గోధుమ ఉత్పత్తి 113.29 మెట్రిక్ టన్నులుగా అంచనా వేశారు. ఇది బలమైన సరఫరాను నిర్ధారిస్తుంది. అయితే మిగులు నిల్వలను మార్కెట్ డిమాండ్లతో సమతుల్యం చేసేందుకు ప్రభుత్వం గతంలో సవాళ్లు ఎదుర్కొంది. కానీ ఇటీవల దేశీయ గోధుమల లభ్యత తగ్గిపోవడంతో దిగుమతులపై ఆధారపడుతుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో మూడు మూడు మెట్రిక్ టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవడం ద్వారా తక్కువ కాలంలో ధాన్యం లభ్యతను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**వేలంలో తగ్గిన ధరలు**

బల్క్ కొనుగోలుదారులు, ప్రాసెసర్లకు ధాన్యాన్ని విక్రయించడానికి ఇటీవల నిర్వహించిన వీక్లీ ఆక్షన్‌లో ఎఫ్‌సీఐ 0.49 మెట్రిక్ టన్నుల గోధుమలను విక్రయించింది. అంతకుముందు వారంకంటే క్వింటాలుకు కనీసం రూ.200 తక్కువకు అమ్ముడయ్యాయని వాణిజ్య వర్గాలు తెలిపాయి. కొత్త మార్కెటింగ్ సీజన్ (202526) కోసం మధ్యప్రదేశ్‌లో మార్చి 15న సేకరణ కార్యకలాపాలు ప్రారంభంకానున్నందున వీక్లీ ఇఆక్షన్ కొనసాగే అవకాశం లేదని వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ అధికారికంగా ఎఫ్‌సీఐ, రాష్ట్ర ఏజెన్సీలు పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాల్లో ఏప్రిల్ 1 నుంచి రైతుల ద్వారా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు గోధుమలను కొనుగోలు చేయనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోని మండీలకు తాజా పంట రావడం ప్రారంభమైందని, ఇది సరఫరాను పెంచుతుందని తెలిపాయి.

**ఈసారి సేకరణ ఇలా..**

202526 రబీ మార్కెటింగ్ సీజన్ (ఏప్రిల్‌జూన్)లో ఏజెన్సీల ద్వారా గోధుమల సేకరణ 31 మెట్రిక్ టన్నులుగా ఉంటుందని ఆహార మంత్రిత్వ శాఖ గత వారం అంచనా వేసింది. ఇది 202425 మార్కెటింగ్ సీజన్‌లో వాస్తవ కొనుగోలు 26.6 మెట్రిక్ టన్నులతో పోలిస్తే 26 శాతం అధికంగా ఉంది. 202122 సీజన్‌లో రికార్డు స్థాయిలో 43.3 మెట్రిక్ టన్నుల సేకరణను సాధించిన తరువాత ఎంఎస్‌పీ, తక్కువ ఉత్పత్తి కారణంగా 202223 సీజన్‌లో రికార్డు స్థాయిలో 18.8 మెట్రిక్ టన్నులకు పడిపోయాయి. అయితే 202324 సీజన్లో ఇది 40 శాతం పెరిగి 26.2 మెట్రిక్ టన్నులకు చేరుకుంది.

202324 పంట సంవత్సరంలో గోధుమ ఉత్పత్తి 113.29 మెట్రిక్ టన్నులుగా అంచనా వేసినట్లు వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రాసెసింగ్ పరిశ్రమ అంచనాల ప్రకారం ప్రస్తుత పంట సంవత్సరంలో (202425) గోధుమ ఉత్పత్తి 110 మెట్రిక్ టన్నులుగా అంచనా వేశారు. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరానికి (202425) ఎంఎస్‌పీ క్వింటాలుకు రూ.2,275 ఉంది.

**బఫర్ కంటే అధికంగానే నిల్వలు**

గతేడాది ఏప్రిల్ 1న ఎఫ్‌సీఐ వద్ద 7.46 మెట్రిక్ టన్నుల గోధుమలు నిల్వ ఉండగా, ఈసారి 13.55 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉన్నాయి. పరిశ్రమ అంచనాల ప్రకారం గోధుమ నిల్వలు ఈ ఏడాది ఏప్రిల్ 1న 1011 మెట్రిక్ టన్నుల మధ్య ఉండే అవకాశం ఉంది. ఇది బఫర్ కంటే కొంచెం ఎక్కువగా ఉంది. 202425 సీజన్‌లో కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పీ క్వింటాలుకు రూ.2425 కంటే మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో క్వింటాలుకు రూ.125 బోనస్ ప్రకటించించారు. దాంతో రాబోయే రెండు వారాల్లో పంట రాబడి పుంజుకున్న తర్వాత మండీ ధరలు క్వింటాలుకు రూ.2600 వరకు ఉండే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.

# టెలికాం ఆపరేటర్లకు ఊరట.. ఎస్‌యూసీ ఛార్జీలు మినహాయింపు..?

**దేశీయ టెలికాం ఆపరేటర్లకు స్పెక్ట్రమ్ యూసేజ్ ఛార్జీలను మాఫీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఈ అంశంపై కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్ మార్చి 10న భారత టెలికాం విభాగం, ఫైనాన్స్ మినిస్ట్రీ అధికారులతో చర్చించబోతున్నట్లు తెలిసింది. దేశ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు కీలకంగా ఉన్న భారత టెలికాం రంగం చాలా కాలంగా ఆర్థిక సవాళ్లతో సతమతమవుతోంది. ఈ తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకోనుండడం గమనార్హం.**

**ఎస్‌యూసీ అంటే ఏమిటి?**

స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలు (ఎస్‌యూసీ)..రేడియో ఫ్రీక్వెన్సీలను ఉపయోగించడానికి టెలికాం ఆపరేటర్లు ప్రభుత్వానికి చెల్లించే రుసుము. ఆపరేటర్ల సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్)లో ఈ ఛార్జీలను కొంత శాతంగా లెక్కిస్తారు. కొన్నేళ్లుగా ఎస్‌యూసీ టెలికాం కంపెనీలకు ఆర్థిక బాధ్యతగా ఉంటోంది. ఇది వాటి లాభదాయకతను, నిర్వహణ సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. దీన్ని మాఫీ చేస్తే వీటి లాభాలు పెరుగుతాయనే వాదనలున్నాయి.

**రూ.5,000 కోట్ల ఆర్థిక ఉపశమనం**

2022 వేలానికి ముందు కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్‌కు ఈ మాఫీని వర్తింపజేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే టెలికాం ఆపరేటర్లకు సుమారు రూ.5,000 కోట్ల ఆర్థిక ఉపశమనం లభించనుంది. 2022 వేలం తర్వాత కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్‌పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) ఇప్పటికే ఎస్‌యూసీను తొలగించింది. దాంతో గతంలో కేటాయించిన దానిపై ఈ మినహాయింపు కీలకంగా మారనుంది.

**టెలికాం రంగంపై ప్రభావం ఇలా..**

ఈ మాఫీ టెలికాం ఆపరేటర్లపై ఆర్థిక ఒత్తిడిని తగ్గిస్తుంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికతలో ఎక్కువ పెట్టుబడులు పెట్టడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఆర్థిక భారాలు తగ్గడంతో టెలికాం కంపెనీలు తమ నెట్‌వర్క్‌లను విస్తరించడం, కనెక్టివిటీని మెరుగుపర్చుకోవడంపై దృష్టి సారించవచ్చు. ఈ రంగంలో ఆరోగ్యకరమైన పోటీని, సృజనాత్మకతను ప్రోత్సహించే అవకాశం ఉంటుంది.

**లబ్ధిదారులు ఎవరంటే..**

రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన టెలికాం సంస్థలు ఈ మాఫీ వల్ల గణనీయంగా ప్రయోజనం పొందనున్నాయి. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.1,100 కోట్లు చొప్పున ఆదా అవుతుందని అంచనా. వొడాఫోన్ ఐడియాకు సుమారు రూ.2,000 కోట్ల ఉపశమనం లభించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**సవాళ్లు ఇవే..**

ఎస్‌యూసీ మాఫీ సానుకూల చర్య అయినప్పటికీ ఈ రంగం ఎదుర్కొంటున్న ఇతర ఆర్థిక సవాళ్లను పరిష్కరించడం చాలా అవసరం. ఉదాహరణకు.. పరిశ్రమ ఏజీఆర్ బకాయిలు, అధిక లైసెన్స్ ఫీజులు, 5జీ టెక్నాలజీలో గణనీయమైన మూలధన పెట్టుబడి వంటి చాలా సమస్యలు టెలికాం విభాగాన్ని సవాలుగా మారుతున్నాయి. వీటిని పరిష్కరించాల్సి ఉంది.

# మహిళలకు ఎస్‌బీఐ ప్రత్యేక పథకం.. డెబిట్ కార్డు

**మహిళా ఎంట్రప్రెన్యూర్లకు పూచీకత్తు లేకుండా, తక్కువ వడ్డీ రేటుపై రుణాలు అందించేలా 'అస్మిత' పథకాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రవేశపెట్టింది. మహిళల సారథ్యంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా యూనిట్లకు డిజిటల్ మాధ్యమం ద్వారా వేగవంతంగా, సులభతరంగా రుణ సదుపాయం లభించేందుకు ఇది ఉపయోగపడుతుందని బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు.**

వినియోగ ప్రయోజనాల కోసం రుణాలు తీసుకోవడానికి ఇష్టపడే మహిళలు వ్యాపార రుణాలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ట్రాన్స్ యూనియన్ సిబిల్ ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఈ ఆవిష్కరణ జరగడం గమనార్హం. ప్రముఖ క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ ప్రకారం.. మహిళలు తీసుకున్న రుణాలలో కేవలం 3 శాతం మాత్రమే వ్యాపార ప్రయోజనాల కోసం, 42 శాతం వ్యక్తిగత రుణాలు, కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్స్, హోమ్ ఓనర్షిప్ వంటి పర్సనల్ ఫైనాన్స్ ఉత్పత్తుల కోసం, 38 శాతం బంగారంపై ఉన్నాయి.





మరోవైపు, మహిళల కోసమే ప్రత్యేకంగా రూపొందించిన రూపే ఆధారిత 'నారీ శక్తి' ప్లాటినం డెబిట్ కార్డును కూడా బ్యాంకు ఆవిష్కరించింది. ఇక మరో ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ప్రవాస భారతీయులలో మహిళల కోసం 'బీవోబీ గ్లోబల్ ఉమెన్ ఎన్ఆర్ఈ అండ్ ఎన్ఆర్ఓ సేవింగ్స్ అకౌంట్' పేరిట ప్రత్యేక ఖాతాను ప్రారంభించింది.



# 'కోర్ట్' సినిమా నచ్చకుంటే.. నా 'హిట్ 3'ని చూడొద్దు: నాని

ప్రియదర్శి ప్రధాన పాత్రలో రోషన్, శ్రీదేవి ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'–స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. ఇందులో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్ష వర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మార్చి 14న హోలీ పండగ సందర్భంగా విడుదల కానుంది. హీరో నాని ప్రొడక్షన్ హౌస్ నుంచి ఈ సినిమా వస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో నానితో పాటు నాగ్ అశ్విన్, మోహనకృష్ణ ఇంద్రగంటి, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు పాల్గొన్నారు.'కోర్ట్' సినిమా సమర్పకుడు నాని ట్రైలర్‌ను విడుదల చేసిన అనంతరం పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. నేను చిత్ర పరిశ్రమలోకి వచ్చి 16ఏళ్లు దాటింది. దయ చేసి ఈ సినిమా చూడండి అని నేనెప్పడూ అడగలేదు. తొలిసారి ఈ మాట ప్రేక్షకులను అడుగుతున్నాను. ఈ సినిమా నిర్మాతగా చెప్పడం లేదు, నా తెలుగు ప్రేక్షకులు ఒక మంచి సినిమా మిస్ అవ్వొద్దని కోరుకుంటున్నా. దయచేసి కోర్టు చిత్రాన్ని ఇంటిల్లిపాది చూడండి. కోర్టు చిత్రం చూసిన వారంతా గర్వంగా థియేటర్ల నుంచి బయటికి వస్తారు.'కోర్టు' సినిమా కంటే హిట్ 3పై పది రెట్లు ఖర్చుపెట్టాను. ఈ చిత్రం ప్రేక్షకులను అంచనాలను అందుకోకపోతే నా నెక్స్ట్ మూవీ 'హిట్3'ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా మీకు చెప్పలేను. ఈ సినిమాతో మీరు తప్పకుండా కనెక్ట్ అవుతారు. ఈ చిత్రంలోని పాత్రలతో ప్రతి ఒక్కరు కూడా ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోతారు. ఆ పాత్రలతో పాటుగా మీరు కూడా నవ్వడమే కాకుండా ఏడిపించేస్తారు.' అని నాని అన్నారు.






# ఐఫా అవార్డ్స్‌కు అంతా సిద్ధం.. ఈసారి ప్రత్యేకత ఏంటో తెలుసా..?

ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల కార్యక్రమానికి ఏర్పాట్లు అన్నీ పూర్తి అయ్యాయి. భారత్‌లోని జైపూర్ వేదికగా ఐఫా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఫా అవార్డులు 2000 సంవత్సరంలో మొదటి సారి ప్రకటించారు. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ రంగాలలో మెప్పించిన నటీన టులు, చిత్రాలను గుర్తించి అవార్డ్స్ అం దిస్తారు. ఈసారి హోస్ట్‌లుగా బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో పాటు నిర్మాత కరణ్ జోహార్ వ్యవహరించనున్నారు.

మార్చి 8,9 తేదీల్లో జైపూర్ వేదికగా ఐఫా వేడుకలు జరగనున్నాయి. ఇప్పటికే భారీగా నటీనటులు అక్కడకు చేరుకున్నా రు. ఐఫా అవార్డ్స్ కార్యక్రమాన్ని భారత్‌లో జరపడం ఇది రెండోసారి. సుమారు ఐదేళ్ల క్రితం ముంబైలో నిర్వహించారు. ప్రతి ఏడాది అబుదాబి, సింగపూర్,మలేషియా, అమెరికా వంటి దేశాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అయితే, ఐఫా అవార్డ్స్ ప్రయాణానికి 25 ఏళ్లు పూర్తి కావడంతో ఈసారి భారత్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నారు. షారుఖ్ ఖాన్, మాధురీ దీక్షిత్, షాహిద్ కపూర్, కృతి సనన్,కరీనా కపూర్, శ్రేయా ఘోషల్ వంటి స్టార్స్ ఐఫా వేదిక మీద తమ డ్యాన్సులతో మెప్పించనున్నారు.

# ఉమెన్స్ డే ఎందుకు.. శ్రుతీహాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు

కమల్ హాసన్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శ్రుతీహాసన్..తనదైన నటనతో తక్కువ సమయంలో ని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ కలిసి సినిమాలు చేసింది. చివరిగా సలార్ సినిమాతో తెలుగు ప్రేక్షకు లను పలకరించింది. కోలీవుడ్ టు బాలీవుడ్.. అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తున్నప్పటికీ శ్రుతీ హాసన్‌పై పెద్దగా పుకార్లేవి రాలేదు. ఏ విషయంలో అయినా ఆమె నిక్కచ్చిగా ఉండమే దానికి కారణం.

ఏ అంశంపై అయినా తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేస్తుంటారు. తాజాగా అంత ర్జాతీయ మహిళా దినోత్సవంపై కూడా శ్రుతీ తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ..అసలు ఉమెన్స్ డేని జరుపుకోవడం దేనికని ప్రశ్నించింది.

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రుతీ మాట్లాడుతూ.. 'మేల్ డే అనేది లేనప్పుడు ప్రత్యేకంగా 'ఉమెన్స్ డే' ఎందుకు ? అంటే ఇంకా స్త్రీ వెనకబడి ఉందని చెప్పడానికే ఈ స్పెషల్ డేస్ జరుపుకుంటున్నారా? అలాగే ఉమెన్ ఓరియెం టెడ్' సినిమా అంటారు. 'మేల్ ఓరియెంటెడ్' మూవీ అనరు. ముందు ఈ తేడా పోవాలి. మహిళా దినోత్స వం అనేది ప్రత్యేకంగా లేని రోజు ఉమెన్ ఎదిగినట్లు లెక్క'అని తనదైన శైలీలో చెప్పుకొచ్చింది.



# ధైర్యంగా బతకాలి... ప్రశాంతంగా ఉండాలి: నదియా

**'మీ విలువ మీరు తెలుసుకోండి... మీకు నచ్చినట్లు మీరు బతకండి" అంటున్నారు నదియా. హీరోయిన్‌గా 1980–1990లలో విజయవంతమైన కెరీర్‌ని చూసిన నదియా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని, అమెరికాలో సెటిలయ్యారు. 1994లో సినిమాలకు దూరమై, 2004లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సిల్వర్ స్క్రీన్‌కి వచ్చారు. 'కారవాన్' వాహన సౌకర్యాలు లేని రోజులను, ఇప్పుడు ఆ సౌకర్యాలు ఉన్న రోజులనూ చూస్తున్నారు నదియా. 'మహిళా దినోత్సవం' సందర్భంగా 'సాక్షి'కి నదియా ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలోని విశేషాలు తెలుసుకుందాం.**

**"నిజ జీవితాన్ని, నా సినీ జీవితాన్ని పంచుకుని నాకు విజయం అందించిన నా హీరోయిన్స్ అందరికీ, యావన్మంది మహిళలకు చేతులెత్తి నమస్కరిస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు" అంటూ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఈ ఫొటోను షేర్ చేసి, చిరంజీవి పేర్కొన్నారు**

**టీనేజ్‌లో హీరోయిన్ అయిన మీకు అప్పటి షూటింగ్ వాతావరణం, అంతమంది వ్యక్తులతో పని చేయడం వంటివి ఇబ్బందిగా అనిపించేదా?**

మలయాళంలో నా తొలి సినిమా 'నోకెత్త దూరత్తు కన్నుమ్ నాట్టు' (1984). ఈ సినిమా తమిళంలో 'పూవే పూచ్చూడవా'గా రీమేక్ అయింది. తమిళం లోనూ నేనే నటించాను. తమిళంలో నాకు తొలి సినిమా. ఆల్రెడీ ఒక భాషలో చేసిన సినిమా కావడం ఒక ప్లస్. మలయాళం సినిమా డైరెక్టర్ ఫాజిల్ తమిళంలోనూ చేశారు. అలాగే నాకు తమిళ్ అస్సలు రాకపోవడంతో ఓ ట్యూటర్‌ను పెట్టి, నేర్పించారు. దాంతో ఈజీ అయింది. షూటింగ్ పరంగా ఎలాంటి చేదు అనుభవా లు ఎదురు కాలేదు. దాంతో భయ పడాల్సిన అవసరం రాలేదు. అలాగే ఆ సినిమా హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసుకోనంతగా బిజీ అయ్యాను.

**సినిమా ఇండస్ట్రీలో అమ్మాయిలు నిలదొక్కుకోవాలంటే చాలా కష్టం అంటారు... ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందనే టాక్ కూడా వినిపిస్తుంటుంది...**

నేను నా అనుభవాల గురించి మాట్లాడతాను. నాతో పాటు మా నాన్న షూటింగ్‌కి వచ్చేవారు. ఒక్క నిమిషం కూడా ఆయన నన్ను ఒంటరిగా వదిలిపెట్టేవారు కాదు. ఆయన అంతగా ప్రొటెక్ట్ చేయడంతో నాకు ప్రెజర్ ఉండేది కాదు. అలాగే వచ్చిన ప్రతి సినిమా కమిట్ చేయించేసి, నాతో ఓవర్ వర్క్ చేయించలేదు. వర్క్‌ని ఎంజాయ్ చెయ్ అన్నారు. నా పక్కన ఓ గైడింగ్ ఫోర్స్ (తండ్రిని ఉద్దేశించి) ఉండటంతో నాకెప్పుడూ 'అన్‌సేఫ్' అనిపించలేదు.

**షూటింగ్ స్పాట్‌లో స్టార్స్‌కి ఏర్పాటు చేసే 'కారవాన్' వాహన సౌకర్యం అప్పట్లో లేదు. పల్లెల్లో షూటింగ్స్ చేసినప్పుడు కాస్ట్యూమ్స్ మార్చుకోవడానికి, ఇతర వ్యక్తిగత విషయాలకూ పడిన ఇబ్బందుల గురించి?**

మాకు బోలెడంత ప్రేమ దక్కేది. విలేజెస్‌లో ఎవరో ఒకరింట్లో కాస్ట్యూమ్స్ మార్చుకునేంత అభిమానం మా మీద ఉండేది. 'ఏం ఫర్వాలేదు. మీ ఇల్లులా అనుకోండి' అనేవాళ్లు. ఎలాంటి భయాలూ ఉండేవి కావు. ఇప్పుడున్నన్ని సౌకర్యాలు లేకపోయి నా హ్యాపీగానే ఉండేది.

**అప్పట్లో సౌకర్యం లేకపోయినా హ్యాపీగానే గడిచిందన్నారు... సో.. ఇప్పుడు కారవాన్ తదితర సౌకర్యాలు పొందుతున్న నటీమణుల లైఫ్ ఇంకా హ్యాపీ అనుకోవచ్చా...**

మాతో పోల్చుకుంటే ఇప్పటి అమ్మాయిలు హ్యాపీ కాదు. అన్ని సౌకర్యాలతో పాటు సమస్యలూ ఎక్కువే. ప్రతి క్షణం ఎవరో ఒకరు మనల్ని గమని స్తున్న ఫీలింగ్. సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ వల్ల పబ్లిక్‌లోకి వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి. ఈ జనరేషన్‌కి ఆ ప్రెజర్ ఎక్కువ.

**మరి... ఈ ప్రెజర్‌ని ఎలా అధిగమించాలి?**

ప్రపంచం మారిపోయింది. మనమూ అందుకు తగ్గట్టు మారాలి. పరిస్థితులు ఇలా ఉన్నాయేం టని భయపడకుండా మన జాగ్రత్తల్లో మనం ఉండటమే.

**నెగటివిటీ ఎక్కువ శాతం ఉన్న ఈ మోడ్రన్ వరల్డ్‌లో అమ్మాయిలు తమ లైఫ్‌ని ఎలా లీడ్ చేయాలంటారు?**

ధైర్యంగా, గర్వంగా బతకాలి. ఎందుకంటే ఆ దేవుడు సృష్టించిన ప్రత్యేకమైనమనుషులం మనం. ఎక్కడ ఉన్నా మనం సౌకర్యంగా ఉండటం మనకు ముఖ్యం. సౌకర్యం అంటే లగ్జరీస్ కాదు. మనకు నచ్చినట్లుగా మనం ఉండటం. అలాగే మనం అను కున్నది నిర్మొహమాటంగా చెప్పాలి. మన విలువని మనం తెలుసుకోవాలి. మనం మన గురించి ఏమనుకుంటున్నామో అదే మనం. తక్కువగా అనుకుంటే తక్కువగా... ఉన్నతంగా అనుకుంటే ఉన్నతంగా. అందుకే మన గురించి మనం ఉన్న తంగా అనుకోవాలి. ఆత్మవిశ్వాసంతో బతకాలి.

**ఇద్దరు అమ్మాయిల తల్లిగా మీ పిల్లలకు ఈ విషయాలు చెబుతుంటారా?**

చెబుతాం. మా అమ్మాయిలకు బాగా స్వేచ్ఛ ఇస్తాం. వాళ్ల ఇష్టాలను కాదనం. వద్దని చెప్పాల్సి వస్తే ఎందుకు వద్దో చెబుతాం. ఎంత జాగ్రత్తగా ఉండాలో వివరిస్తాం. ఒకప్పుడు పెద్దలు చెప్పిన మాటలను పిల్లలు వినేవాళ్లు. ఇప్పుడు టెక్నాలజీ బాగా పెరిగిన ఈ కాలంలో పిల్లలు చెప్పేది కూడా పెద్దలు వినాలి. మేం మా పిల్లలతో బాగా కమ్యూని కేట్ అవుతాం. మా పిల్లలకే కాదు... ఎవరికైనా నేను చెప్పేదేంటంటే... ధైర్యంగా బతకాలి... ప్రశాంతం గా ఉండాలి.

**నా జీవితం హ్యాపీ**

నా జీవితం మొత్తం సాఫీ. హీరోయిన్‌గా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని, మా ఆయనతో అమెరి కాలో సెటిలయ్యాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ లైఫ్‌ని పరిపూర్ణంగా ఆస్వాదించాను. చాలా గ్యాప్ తర్వాత సినిమాలకు చాన్స్ వచ్చింది. 'నటిగా నీ పూర్తి ప్రతిభని నువ్వు వినియోగించుకోలేదు.. సినిమాలు కంటిన్యూ చెయ్' అని మా ఆయన, 'మళ్లీ యాక్ట్ చెయ్ అమ్మా' అని పిల్లలు అన్నారు. వచ్చాను.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీగా ఉన్నాను.




# వుమెన్స్ డే.. ఆర్జీవీ ట్వీట్ వైరల్

రామ్ గోపాల్ వర్మ..ఎప్పుడు ఏ పని చేస్తాడో, ఎలాంటి కామెంట్స్ చేస్తాడో ఎవరికీ తెలియదు. ఓ అంశంపై అందరూ ఒకలా అభిప్రాయం వ్యక్తం చేస్తే.. ఆయన మాత్రం కాస్త డిఫరెంట్‌గా స్పందిస్తుంటాడు. దానికి లాజికైన సమాధానం కూడా ఆయన దగ్గర ఉంటుంది. అందుకే ఆర్జీవీ ట్వీట్స్ ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. కేవలం సినిమాల గురించే కాదు.. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశంపై ఇతరులకు భిన్నంగా స్పంది స్తుంటాడు. నేను(మార్చి 8) అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా మహిళలకు శుభాకాంక్ష లు తెలిపారు.

ఆర్జీవీకి కూడా వుమెన్స్ డే విషెస్ తెలియజే శాడు. అయితే అందరిలా శుభాకాంక్షలు తెలిపితే ఆర్జీవీ ఎందుకు అవుతాడు? ఆయన విషెస్ కూడా కాస్త డిఫరెంట్‌గానే ఉంటాయి. 'నా ఉనికి లేకుండా నేను జీవించగలను, కానీ స్త్రీల ఉనికి లేకుండా నేను జీవించలేను .. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు' అని ఆర్జీవీ ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఆర్జీవీ కూడా ఇలాంటి పోస్టులు పెడతారా' అని కొంతమంది షాకవుతుంటే.. 'సూపర్ సార్.. మీకు మీరే లెజెండ్', 'భళే చెప్పావ్ సర్' అంటూ మరికొంతమంది కామెంట్ చేస్తున్నారు.

ఇక సినిమాల విషయానికి వస్తే.. రామ్ గోపాల్ వర్మ ప్రొడక్షన్‌లో ప్రముఖ వ్యాపా రవేత్త రవిశంకర్ వర్మ'శారీ'అనే మూవీని నిర్మిస్తున్నారు. గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంతో సత్య యాదు, ఆరాధ్య జంటగా నటించారు. మార్చి 21న ఈ చిత్రం రిలీజ్ కానుంది.



# ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్..

**ఐపీఎల్-2025 ఆరంభానికి ముందు ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్ తగలింది. ఆ జట్టు స్టార్ పేసర్, టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రాగాయం కారణంగా ఐపీఎల్ ఫస్ట్ హాఫ్ సీజన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. బుమ్రా ప్రస్తుతం వెన్ను గాయంతో బాధపడుతున్నాడు.**

ఈ క్రమంలోనే కీలకమైన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి సైతం బుమ్రా దూరమయ్యాడు. బుమ్రా ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందుతున్నాడు. అతడు తన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి రెండు నుంచి మూడు వారాల సమయం పట్టనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ భారత స్పీడ్ స్టార్ ఏప్రిల్‌లో ముంబై ఇండియన్స్ శిబిరంలో చేరే అవకాశం ఉంది.

"బుమ్రా వేగంగా కోలుకుంటున్నాడు. అతడి మెడికల్ రిపోర్ట్స్ బాగానే ఉన్నాయి. అతడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తిరిగి తన బౌలింగ్ ప్రాక్టీస్‌ను ప్రారంభించాడు. అయితే ఐపీఎల్‌లో బౌలింగ్ చేసే ఫిట్‌నెస్ మాత్రం ఇంకా సాధించలేదు. ఏప్రిల్ మొదటి వారంలో బుమ్రా తిరిగి మైదానంలో అడుగుపెట్టే అవకాశముంది. అది కూడా మేము కచ్చితంగా చెప్పలేము. మా వైద్య బృందం అతడిపై క్రమంగా వర్క్‌లోడ్ పెంచుతుంది.

అతడు ఎటువంటి అసౌకర్యం లేకుండా బౌలింగ్ చేయగలిగితేనే వైద్య బృందం క్లియరన్స్ ఇస్తోంది. అప్పటివరకు అతడు సీఓఈలోనే ఉండనున్నాడని" బీసీసీఐ అధికారి ఒకరు టైమ్స్ ఆఫ్ ఇండియాతో పేర్కొన్నాడు. కాగా ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌లో మార్చి 23న చెన్నైసూపర్ కింగ్స్‌తో తలపడనుంది.

**హార్దిక్ కూడా..**

ఈ మ్యాచ్‌కు ముంబై రెగ్యూలర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా సైతం దూరం కానున్నాడు. గతేడాది సీజన్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా పాండ్యాపై ఒక్క మ్యాచ్ నిషేధం పడింది. హార్దిక్ గత సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మూడోసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమయ్యాడు.

దీంతో వరుసగా మూడు సార్లు స్లో ఓవరేట్‌ను మెయింటేన్ చేయడంతో ఐపీఎల్ నిర్వహకులు అతడిపై ఆడకుండా ఒక్క మ్యాచ్ నిషేధం విధించారు. ఆ బ్యాన్‌ను పాండ్యా ఈ ఏడాది సీజన్‌లో ఎదుర్కొన్నాడు. తొలి మ్యాచ్‌కు బెంచ్‌కే పరిమితం కానున్నాడు. కాగా గతేడాది సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణ ప్రదర్శనతో లీగ్ స్టేజికే పరిమితమైన సంగతి తెలిసిందే.

# ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు ముందు విరాట్‌కు గాయం..?

**ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి గాయమైనట్లు తెలుస్తుంది. ఇవాళ (మార్చి 8) ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా విరాట్ గాయపడినట్లు జియో న్యూస్ తెలిపింది. నెట్స్‌లో ఓ పేసర్‌ను ఎదుర్కొనే క్రమంలో విరాట్ మోకాలికి గాయమైనట్లు సమాచారం. గాయపడిన అనంతరం విరాట్ ప్రాక్టీస్‌ను ఆపేసినట్లు తెలుస్తుంది. విరాట్ గాయానికి ఫిజియో చికిత్స చేశాడని సమాచారం.**



చికిత్స తర్వాత విరాట్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లకుండా మైదానంలోనే సహచరులతో గడిపినట్లు తెలుస్తుంది. విరాట్ గాయంపై కోచింగ్ స్టాఫ్‌ను ఆరా తీయగా తీవ్రమైంది కాదని పేర్కొన్నట్లు తెలుస్తుంది. ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ మోకాలికి కట్టు కట్టుకుని తిరిగినట్లు జియో న్యూస్ పేర్కొంది.

విరాట్ గాయం గురించి తెలిసి అభిమానులు తొలుత ఆందోళన చెందారు. విరాట్ గాయంపై టీమిండియా మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఫైనల్లో విరాట్ ఎంత కీలకమైన ఆటగాడో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఒకవేళ స్వల్ప గాయమైనా ముందు జాగ్రత్త చర్చగా విరాట్‌ను ప్రాక్టీస్ చేయనిచ్చి ఉండరు.

ఈ టోర్నీలో విరాట్ అత్యంత కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడి టీమిండియా ఫైనల్‌కు చేరడంలో ముఖ్యపాత్ర పోషించాడు. ఈ టోర్నీలో విరాట్ దాయాది పాకిస్తాన్‌పై సూపర్ సెంచరీ చేసి భారత్‌ను గెలిపించాడు. ఆసీస్‌తో జరిగిన సెమీ ఫైనల్లోనూ విరాట్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో కూడా విరాట్ సెంచరీ చేసుండాల్సింది. అయితే తృటిలో ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాడు.

విరాట్ సూపర్ ఫామ్‌ను ఫైనల్లోనూ కొనసాగించి భారత్‌కు మరో ఐసీసీ టైటిల్ అందించాలని టీమిండియా అభిమానులు కోరుకుంటున్నారు. ఫైనల్లో విరాట్ మంచి ఇన్నింగ్స్ ఆడితే భారత విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు. దుబాయ్ పిచ్‌లకు విరాట్ అలవాటు పడ్డాడు కాబట్టి ఫైనల్లో తప్పక రాణిస్తాడని అంతా అనుకుంటున్నారు.

కాగా, దుబాయ్ వేదికగా రేపు (మార్చి 9) జరుగబోయే ఫైనల్లో టీమిండియా న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీలో టీమిండియా అజేయ జట్టుగా ఫైనల్‌కు చేరింది. భారత్.. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌నూ సూపర్ విక్టరీలు సాధించి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఆసీస్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు చేరింది.

మరోవైపు న్యూజిలాండ్ గ్రూప్ దశలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌పై విజయాలు సాధించి, భారత్ చేతిలో ఓడింది. అయినా గ్రూప్‌ఏలో రెండో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో కివీస్ సౌతాఫ్రికాను చిత్తు చేసి తుది పోరుకు అర్హత సాధించింది.

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2000 ఎడిషన్ ఫైనల్లో కివీస్ భారత్‌ను ఢీకొట్టి విజేతగా నిలిచింది. న్యూజిలాండ్‌కు అది తొలి ఐసీసీ టైటిల్. ఐసీసీ టోర్నీల్లో టీమిండియాను న్యూజిలాండ్‌పై అంత మంచి ట్రాక్ రికార్డు లేదు. ఈ టోర్నీలో భారత్ న్యూజిలాండ్‌ను గ్రూప్ దశలో ఓడించినప్పటికీ.. ఫైనల్లో ఓడించడం మాత్రం అంత ఈజీ కాదు.

ఐసీసీ ఈవెంట్లలో (అన్ని ఫార్మాట్లలో) న్యూజిలాండ్ భారత్‌తో ఆడిన 16 మ్యాచ్‌ల్లో పదింట గెలిచింది. ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత్‌పై న్యూజిలాండ్‌కు మరింత ఘనమైన ట్రాక్ రికార్డు ఉంది. ఐసీసీ నాకౌట్స్‌లో భారత్, న్యూజిలాండ్ నాలుగు సార్లు ఎదురెదురుపడగా.. 3 మ్యాచ్‌ల్లో కివీస్, ఒక మ్యాచ్‌లో భారత్ గెలుపొందాయి.

న్యూజిలాండ్ తమ చరిత్రలో గెలిచిన రెండు ఐసీసీ టైటిళ్లు భారత్‌పైనే (ఫైనల్స్‌లో) సాధించినవే కావడం గమనార్హం. 2000 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత న్యూజిలాండ్ తమ రెండో ఐసీసీ టైటిల్‌ను 2021లో సాధించింది. 20192021 డబ్ల్యూటీసీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.



**ఛాంపియన్స్ ట్రోఫీ-2025 తుది అంకానికి చేరింది. దుబాయ్ వేదికగా రేపు (మార్చి 9) జరుగబోయే ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతుంది. క్రికెట్ అభిమానులు ఈ మ్యాచ్ కోసం కళ్లకు వత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు.**



# ఛాంపియన్స్ ట్రోఫీ విజేతకు ప్రైజ్‌మనీ ఎంతో తెలుసా..?

**విజేతకు భారీ ప్రైజ్‌మనీ**

ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచే జట్టు భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ లభించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రకటించిన వివరాల ప్రకారం.. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టుకు దాదాపు రూ. 19.48 కోట్లు ($2.24 మిలియన్) లభిస్తాయి. ఫైనల్లో ఓడిపోయిన జట్టు రూ. 9.74 కోట్లు ($1.12 మిలియన్) పొందుతుంది.

**సెమీఫైనలిస్టులకు కూడా భారీ ప్రైజ్‌మనీ**

ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనలిస్ట్‌లకు కూడా భారీ ప్రైజ్‌మనీ లభించనుంది. సెమీస్‌లో ఓడిన జట్లు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా రూ. 4.87 కోట్లు ($5,60,000) చొప్పున పొందుతాయి. ఈసారి గ్రూప్ దశ నుంచి నిష్క్రమించిన జట్లకు కూడా ప్రైజ్‌మనీ లభిస్తుంది.ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌కు రూ. 3.04 కోట్లు ($3,50,000) లభిస్తాయి. ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచే పాకిస్తాన్, ఇంగ్లండ్ జట్లకు సుమారు రూ. 1.22 కోట్లు ($1,40,000) లభిస్తాయి. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఐసీసీ సుమారు రూ. 60 కోట్లు ($6.9 మిలియన్లు) కేటాయించింది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీతో పోలిస్తే ఇది 53 శాతం అధికం.




**అజేయ భారత్**

ఈ టోర్నీలో టీమిండియా అజేయ జట్టుగా ఫైనల్‌కు చేరింది. భారత్.. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌నూ సూపర్ విక్టరీలు సాధించి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఆసీస్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు చేరింది. మరోవైపు న్యూజిలాండ్ గ్రూప్ దశలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌పై విజయాలు సాధించి, భారత్ చేతిలో ఓడింది. అయినా గ్రూప్ ఏలో రెండో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో కివీస్ సౌతాఫ్రికాను చిత్తు చేసి తుది పోరుకు అర్హత సాధించింది.

**రెండోసారి**

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2000 ఎడిషన్ ఫైనల్లో కివీస్ భారత్‌ను ఢీకొట్టి విజేతగా నిలిచింది. న్యూజిలాండ్‌కు అది తొలి ఐసీసీ టైటిల్. ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్ సాధించిన రెండో టైటిల్ కూడా భారత్‌పైనే (ఫైనల్స్) కావడం గమనార్హం. 20192021 డబ్ల్యూటీసీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐసీసీ ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌పై భారత్‌కు మంచి ట్రాక్ రికార్డు లేకపోవడంతో భారత అభిమానులు ఆందోళన పడుతున్నారు.

# శుబ్‌మన్ గిల్‌కు ప్రమోషన్.. ఏకంగా రూ. 7 కోట్ల జీతం!?




**భారత క్రికెట్ బోర్డు(బీసీసీఐ) 2025-26 ఏడాదికి గాను ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించేందుకు సిద్ధమైంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ముగిసిన తర్వాత ఈ లిస్ట్‌ను రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. గతేడాది సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్ దక్కనున్నట్లు సమాచారం.**

అతని సెంట్రల్ కాంట్రాక్ట్‌ను పునరుద్దరించేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దేశీవాళీ క్రికెట్‌లో ఆడాలన్న తమ ఆదేశాలను ధిక్కరించడంతో బీసీసీఐ అయ్యర్‌పై వేటు వేసింది. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుని రంజీల్లో ఆడిన శ్రేయస్ తిరిగి జాతీయ జట్టులోకి వచ్చాడు.

జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన అయ్యర్.. తన అద్భుతప్రదర్శనతో అందరిని ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలోనూ శ్రేయస్ దుమ్ములేపుతున్నాడు. ఈ క్రమంలోనే అతడికి తిరిగి మళ్లీ కాంట్రాక్ట్ ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించుకుంది.

**గిల్‌కు ప్రమోషన్.. కోహ్లి, రోహిత్‌కు డిమోషన్**

మరోవైపు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న టీమిండియా వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు సైతం ప్రమోషన్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గిల్ ప్రస్తుతం బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్‌ల్లో ఏ కేటగిరిలో ఉన్నాడు. ఇప్పుడు అతడిని టాప్ గ్రేడ్(ఏ ప్లస్)కు ప్రమోట్ చేయాలని బీసీసీఐ పెద్దలు నిర్ణయించుకున్నారంట. కాగా ప్రస్తుతం ఏ ప్లస్ కేటగిరిలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రాలు మాత్రమే ఉన్నారు. అయితే అంతర్జాతీయ టీ20లకు విడ్కోలు పలికిన కోహ్లి, రోహిత్ శర్మ, జడేజా కాంట్రాక్‌లు మారనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ సీనియర్ త్రయాన్ని ఏ ప్లస్ నుంచి ఏ గ్రేడ్‌కు డిమోట్ చేసే అవకాశముంది. వీరిస్థానాల్లో గిల్‌తో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఏ ప్లస్ కేటగిరిలో చోటు దక్కే సూచనలు కన్పిస్తున్నాయి.

**కేటగిరి వారీగా ఆటగాళ్లకు దక్కే మొత్తం ఎంతంటే?**

ఏ ప్లస్ కేటగిరిలో ఉన్న ఆటగాళ్లకు వార్షిక వేతనం కింద యేటా రూ. 7 కోట్లు దక్కనున్నాయి. 'ఏ' కేటగిరీలోని క్రికెటర్లకు రూ. 5 కోట్లు..'బి' కేటగిరిలో ఉన్న వారికి రూ. 3 కోట్లు.. 'సి' కేటగిరిలో ఉన్న క్రికెటర్లకు కోటి రూపాయల వార్షిక వేతనం లభించనుంది.

**కివీస్‌తో ఫైనల్ పోరు..**

ఇక ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయ్ వేదికగా జరగనున్న ఫైనల్ పోరులో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు కివీస్ కూడా భారత్‌ను ఓడించి రెండోసారి ఈ మెగా టోర్నీటైటిల్‌ను ముద్దాడాలని పట్టుదలతో ఉంది.




# వరుణ్ మిస్టరీ కోడ్‌ను కివీస్ బ్యాటర్లు ఛేదించగలరా..?

**భారత్, న్యూజిలాండ్ మధ్య దుబాయ్‌లో జరుగనున్న 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌ను రెండు సమవుజ్జీలైన జట్ల మధ్య జరిగే టైటిల్ పోరుగా అభివర్ణించవచ్చు. బ్యాటింగ్ పరంగా చూస్తే భారత్, న్యూజిలాండ్ రెండు జట్ల బ్యాట్స్మన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. భారత్ తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్ లో మినహా న్యూజిలాండ్ బ్యాట్స్మన్ ఎక్కడా తడబడినట్టు కానీ, తక్కువ స్థాయిలో ఆడుతున్నట్టు కానీ కనిపించలేదు. న్యూజిలాండ్ ను ఈ మ్యాచ్ లో నిలువరించి ఘనత భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి దక్కుతుంది.**

**తొలి పోరులో వరుణ్ దే పైచేయి**

గత ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి కివీస్ బ్యాట్స్మన్‌ని తన వైవిధ్యమైన బౌలింగ్ తో ముప్పతిప్పలు పెట్టాడు. అంటే న్యూ జిలాండ్ బ్యాట్స్మన్ కి స్పిన్నర్లను ఆడటం తెలియక కాదు. వారి జట్టులోనూ అద్భుతమైన స్పిన్నర్లు ఉన్నారు. స్పిన్నర్ల పై ఆధిపత్యం సాధించే అద్భుతమైన బ్యాట్స్మన్ కూడా ఉన్నారు. కానీ వరుణ్ మాత్రం విభిన్నమైన స్పిన్నర్. అతని బౌలింగ్ యాక్షన్ బట్టి అతని ఎలాంటి బంతి వేస్తాడో అంచనా వేయడం కష్టం.

అదే ప్రత్యర్థి బ్యాట్స్మన్ కి పెద్ద అవరోధంగా కనిపిస్తోంది. అందుకే ఆ మ్యాచ్ లో వరుణ్ మిస్టరీ కోడ్‌ను అర్థం చేసుకోవడానికి కివీస్ బ్యాటర్లు నానా తిప్పలు పడ్డారు. ఈ మ్యాచ్ లో వరుణ్ 52 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఇందులో విల్ యంగ్, గ్లెన్ ఫిలిప్స్ మరియు మిచెల్ సాంట్నర్ వంటి కీలక వికెట్లు కూడా ఉన్నాయి.

ఆ తర్వాత సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై కూడా వరుణ్ మంచి వైవిధ్యం తో బౌలింగ్ చేసాడు. ఎప్పుడూ భారత్ జట్టుకి ప్రధాన అడ్డంకి గా నిలిచే ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్‌ను తన తొలి బంతితోనే బోల్తా కొట్టించాడు. వరుణ్ ఫామ్ ఫైనల్‌కి ముందు భారత్‌కు అదనపు బలాన్నిస్తునడంలో సందేహం లేదు.

**వరుణ్ గురించి హెచ్చరించిన కివీస్ కోచ్**

అందుకే మ్యాచ్ కి ముందే న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్ తమ బ్యాట్సమన్లని వరుణ్ నుంచి ఎదురయ్యే సవాలుకి సిద్ధంగా ఉండాలని హెచ్చరించాడు. గత మ్యాచ్ లో మా జట్టు పై 5/42 గణాంకాలతో పైచేయి సాధించిన వరుణ్ ఫైనల్లో ఆడతాడని కచ్చితంగా చెప్పగలను. వరుణ్ ఒక క్లాస్ బౌలర్.

గత మ్యాచ్ లో మాకు తన నైపుణ్యం మేమిటో రుచి చూపించాడు. ఫైనల్లో వరుణ్ మాకు పెద్ద ముప్పుగా భావిస్తున్నాం. ఈ విషయం (వరుణ్ మా ప్రధాన అడ్డంకి అని ) ముందే తెలిసింది కాబట్టి అతన్ని ఎలా ఎదుర్కోగలం. ఎలా పరుగులు సాధించగలము అనే దాని పై అంచనాలు వేస్తున్నామని స్టీడ్ అన్నాడు.

**హెన్రీ ఆడతాడా?**

న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్ సందర్భంగా కివీస్ స్టార్ పేసర్ మాట్ హెన్రీ గాయపడ్డాడు. ప్రమాదకరమైన బ్యాట్స్మన్ హెన్రిచ్ క్లాసెన్‌ను అవుట్ చేసే ప్రయత్నంలో డైవింగ్ క్యాచ్ తీసుకుంటుండగా, హెన్రీ కుడి భుజంపై గాయమైంది.

వెంటనే ఫిజియోలు అతనిని పరిశీలించినప్పటికీ అతను తీవ్ర అసౌకర్యంతో ఉన్నట్టు కనిపించాడు. చివరికి హెన్రీ మైదానం నుండి బయటకు వెళ్లవలసి వచ్చింది. ఈ మ్యాచ్ లో మాట్ హెన్రీ తన 10 ఓవర్లను పూర్తి చేయలేకపోయాడు. అతను కేవలం 7 ఓవర్లు బౌలింగ్ చేసి 2 వికెట్లు తీసి 42 పరుగులు ఇచ్చాడు.

ఈ మ్యాచ్ అనంతరం న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ మాట్లాడుతూ.. మాట్ హెన్రీ భుజం కొంచెం నొప్పిగా ఉందని.. అతను భారత్‌తో ఫైనల్ ఆడగలడో లేదో వేచి చూడాలన్నాడు. ఈ మ్యాచ్ లో భారత్ బ్యాట్స్మన్ ని నిలువరించడంలో హెన్రీ కీలక పాత్ర వహించాడు. ఈ మ్యాచ్ లో హెన్రీ ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో తన అత్యుత్తమ గణాంకాలు (5/42) నమోదు చేసుకున్నాడు. ఫైనల్లో హెన్రీ ఆడకపోతే న్యూజిలాండ్‌కు పెద్ద దెబ్బ అవుతుంది.